# ఇంజినీరింగ్‌లో కొత్తగా 15 వేల సీట్లు

## రాష్ట్రంలో 179 కాలేజీలకు ఏఐసీటీఈ అనుమతి

- మొత్తం సీట్లు 1.38 లక్షలు.. 70 శాతం కంప్యూటర్ కోర్సులే
- సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే కౌన్సెలింగ్‌లో అవకాశం
- ఈ నెల 19 నుంచి ఎప్ సెట్ అడ్మిషన్ల ప్రక్రియ



**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలో ఇంజినీరింగ్ కాలేజీల్లో ఈ ఏడాది సీట్ల సంఖ్య పెంచుతూ ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) నిర్ణయం తీసుకుంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 15 వేల సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని 179 ఇంజినీరింగ్ కాలేజీలకు అనుమతులు మంజూరు చేసింది. వీటిలో మొత్తం 1.38 లక్షల సీట్లను ఏఐసీటీఈ అప్రూవ్ చేసింది. ఈ మేరకు తాజాగా టెక్నికల్ ఎడ్యుకేషన్ అధికారులకు ఏఐసీటీఈ వివరాలు పంపించింది. ఈ నెల 19 నుంచి ఎప్ సెట్ ఫస్ట్ ఫేజ్ అడ్మిషన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. గత ఏడాది విద్యాశాఖ అధికారులు 1.23 లక్షల సీట్లతో కౌన్సెలింగ్ నిర్వహించగా, అందులో దాదాపు లక్ష సీట్లు నిండాయి. ఈసారి ఏఐసీటీఈ కొత్తగా 15 వేల సీట్లను పెంచడంతో మొత్తం సీట్ల సంఖ్య 1.38 లక్షలకు చేరింది. వీటిలో కొన్ని ప్రైవేటు వర్సిటీలకు సంబంధించిన ఆఫ్ క్యాంపస్ సీట్లు కూడా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. కొత్త సీట్లకు అనుమతులు వస్తే ఈ ఏడాది పోటీ మరింత తగ్గే అవకాశం ఉందని, ఎక్కువ మంది విద్యార్థులకు నచ్చిన కోర్సుల్లో సీట్లు దొరికే చాన్స్ ఉందని ఆఫీసర్లు చెప్తున్నారు. అయితే, ప్రస్తుతం ఇంజినీరింగ్ సీట్లలో 70శాతం సీట్లు కంప్యూటర్ సైన్స్, దాని అనుబంధ కోర్సుల్లోనే ఉన్నాయి.

**పర్మిషన్ ఇస్తేనే కౌన్సెలింగ్‌లోకి..**

ప్రస్తుతం కొత్త సీట్లపై జేఎన్టీయూ, ఓయూ, కేయూ సహా పలు వర్సిటీలు ఆయా కాలేజీల్లో ఉన్న వసతులపై కసరత్తు చేస్తున్నాయి. ఏఐసీటీఈ అనుమతి ఇచ్చిన సీట్లకు తగ్గట్టుగా కాలేజీల్లో ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ, ఇతర మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేదా? అని అధికారులు పరిశీలించనున్నారు. వీటి ఆధారంగా నివేదికను ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తేనే ఈ కొత్త సీట్లను కౌన్సెలింగ్‌లో చేర్చుతారు. ఇప్పటికే పలు వర్సిటీలు గత ఏడాది ఉన్న సీట్ల వివరాలను ఎప్ సెట్ కౌన్సెలింగ్ అధికారులకు అందజేశాయి. ప్రభుత్వం నుంచి కొత్త సీట్లకు అనుమతి లభిస్తే, వాటిని అదనంగా వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయనున్నారు..

**కన్వీనర్, మేనేజ్‌మెంట్ సీట్లకు ఒకేసారి కౌన్సెలింగ్**

ఇంజినీరింగ్ అడ్మిషన్ల ప్రక్రియలో ఈసారి విద్యాశాఖ కీలక మార్పు చేసింది. ప్రతి ఏటా రెండో విడత కౌన్సెలింగ్ ముగిసిన తర్వాతే మేనేజ్‌మెంట్ కోటా భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అధికారులు, ఈసారి మాత్రం కన్వీనర్ కోటాతో పాటే మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి షెడ్యూల్ జారీ చేశారు. దీంతో ఈ నెల 19 నుంచే రెండు విభాగాల కౌన్సెలింగ్ ప్రక్రియలు ఒకేసారి సమాంతరంగా మొదలుకానున్నాయి. రాష్ట్రంలోని మొత్తం సీట్లలో 70 శాతం కన్వీనర్ కోటా కింద, మిగిలిన 30 శాతం మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేయనున్నారు. ఈ నిర్ణయంతో అడ్మిషన్ల ప్రక్రియ మరింత వేగంగా ముగిసే అవకాశం ఉంది.

---

## జేఎన్‌టీయూహెచ్ రెక్టర్, రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు



**నవతెలంగాణ-కేపీహెచ్‌బీ**

జేఎన్‌టీయూహెచ్ నూతన రెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డా.ఏ. దామోదరం, రిజిస్ట్రార్‌గా డా. జయలక్ష్మిలను మంగళవారం జేఎన్‌టీయూహెచ్ పరిశోధక విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీహెచ్‌డీ స్కాలర్ చల్లా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. డా. ఏ. దామోదరం గతంలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి డేటా మేనేజ్‌మెంట్ సలహాదారుగా, జేఎన్‌టీయూహెచ్ స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించడం విశేషమన్నారు. కంప్యూటర్ సైన్స్ రంగంలో 44 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడం విశ్వవిద్యాలయ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. నూతన రిజిస్ట్రార్ డా. జయలక్ష్మి జేఎన్‌టీయూహెచ్ యూజీసీ వ్యవహారాల డైరెక్టర్‌గా, మాజీ ప్రిన్సిపాల్‌గా సేవలందించడంతో పాటు విద్యా, పరిశోధన రంగాల్లో 100కు పైగా జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించడం, 15 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించడం అభినందనీయమన్నారు. స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు, ఏఐసీటీఈ లిలావతి అవార్డుఅందుకోవడం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఇరువురి నాయకత్వంలో జేఎన్‌టీయూహెచ్ తోపాటు రాష్ట్రంలోని 216 ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీటెక్ విద్యార్థులు జయరామ్, సాయిరామ్, అఖిల, నవ్య, మనీష్, యశోవర్ధన్, రామ్, విశ్వజిత్, హర్ష, నితిన్, సంపత్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

---

## పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 166 మంది హాజరు



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ఉద్యోగులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో మంగళవారం పాలిసెట్ కౌన్సెలింగ్ జరిగింది. మొదటి విడత ఇప్పటికే పూర్తికాగా. రెండో విడతలో మిగిలిపోయిన వారి కోసం అవకాశం కల్పించారు. 200మంది విద్యార్థులకుగాను 166 మంది హాజరయ్యారు. ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ పర్యవేక్షణలో ఉద్యోగులు విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించి రసీదులు ఇచ్చారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6వరకు కౌన్సెలింగ్ కొనసాగింది.

**నేటి నుంచి ఈ-సెట్‌కు..**

జేఎన్‌టీయూ ప్రవేశాల విభాగంలో బుధవారం నుంచి ఈ-సెట్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ బి.బాలునాయక్ చెప్పారు. మూడు రోజుల పాటు ఈ నెల 19వ తేదీ వరకు జరగనున్న ఈ కౌన్సెలింగ్ రోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6వరకు కొనసాగుతుంది. మొదటిరోజు 300కు పైగా విద్యార్థులు హాజరవుతారని ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## రెక్టార్, రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు



జయలక్ష్మికి పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ ఎ.దామోదరం, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జయలక్ష్మిని మంగళవారం పలువురు విద్యార్థి నేతలు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. వారిని కలిసిన వారిలో విద్యార్థులు చల్లా రామకృష్ణారెడ్డి, సాయిరాం, అఖిల, నవ్య, మనీష్, యశోవర్ధన్ తదితరులు ఉన్నారు.